

యాదగిరిగుట్ట వ్యవసాయ కార్యాలయం వద్ద రైతుల నిరసన

# కొందరికే రైతు 'భరోసా'!

- తమకు జమ కాలేదంటూ పలువురి ఆందోళన
- యాదగిరిగుట్ట ఏవోను నిలదీసిన రైతులు
- సమాధానం చెప్పలేక ఇబ్బందిపడ్డ అధికారి

యాదగిరిగుట్ట, జూన్ 20: కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న రైతుభరోసా రైతులకు నిరాశే మిగులుస్తున్నది. వారికి ఉన్న భూమిలో కొంత మేరకే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసి సర్కార్ చేతులు దులుపుకొంటున్నది. శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలోని ఏవో కార్యాలయానికి పలు గ్రామాలకు చెందిన రైతులు వచ్చి తమకు అరకొరగా రైతుభరోసా నగదు జమైందని, ఎంతవరకు పడిందో అర్థం కావడంలేదని వ్యవసాయాధికారులను ప్రశ్నించారు. ఇంతకి రైతు భరోసా వస్తుందా రాదా? అంటూ నిలదీయడంతో అధికారులు ఇబ్బందిపడ్డారు. మరికొద్దిరోజుల్లో అందరికీ రైతు భరోసా అందుతుందని సమాధానం చెప్పడమే తప్ప వారి వద్ద సరైన సమాధానం లేకుండాపోయింది. తనకున్న వ్యవసాయ భూమికి ఇప్పటివరకు రైతుభరోసా రాలేదని గౌరాయిపల్లికి చెందిన రైతు వనగంటి సత్తయ్య ఆందోళన వ్యక్తంచేశారు. రూ.2000 ఖాతాలో జమయ్యాయని, అవి ఎక్కడివో అర్థం కావడంలేదని అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. రామాజీపేటకు చెందిన రైతు తునికి ఆంజనేయులు తనకు ఉన్న 5 ఎకరాల భూమికి గతంలో రైతుబంధు నగదు ఖాతాల్లో జమయ్యేదని, కానీ గత రెండు దఫాలుగా రైతుభరోసాతో పాటు రుణమాఫీ సైతం మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సొంత మండలంలోనే రైతులకు రైతు భరోసా మంజూరు కాలేదంటే జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ప్రతి రైతుకు రైతు భరోసాను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**మిగతా భూమికి ఇస్తరో లేదో?**

నాకు 2.09 ఎకరాల పట్టా భూమి ఉన్నది. గత ప్రభుత్వ హయాంలో పూర్తిస్థాయిలో రైతు బంధు ఖాతాలో జమ అయ్యేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుభరోసా రాకపోగా ఈసారి కేవలం 25 గుంటలకు మాత్రమే రైతు భరోసా అందింది. మిగతా భూమికి ఇస్తరో లేదో తెలుస్తలేదు.

- రామిరెడ్డి, గౌరాయిపల్లి, మం: యాదగిరిగుట్ట

# ఎనికెపల్లి రైతులకు న్యాయం చేయండి

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే కాలె యాదయ్య విజ్ఞాపన
- పరిష్కారం తన పరిధిలో లేదని, సీఎంను కలవాలన్న కలెక్టర్

మొయినాబాద్, జూన్ 20: రంగారెడ్డి జిల్లా ఎనికెపల్లి గోశాల నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని కోరారు. పేద రైతులను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదంటూ ఇటీవల పత్రికల్లో కథనాలు వచ్చిన నేపథ్యంలో శుక్రవారం రైతులను వెంటబెట్టుకుని కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి రైతులు తమ గోడు వెల్లబోసుకున్నారు. తమ భూములను ప్రభుత్వం లాక్కుంటే జీవనాధారం కోల్పోతామని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఎకరాకు 1000 గజాల చొప్పున భూమిపరిహారం ఇవ్వాలని వినతిపత్రం సమర్పించారు. పరిష్కారం తన పరిధిలో లేదని, సీఎంను కలవాలని కలెక్టర్ వారికి సూచించారు.

# కరప్షన్‌కు కేరాఫ్ కాంగ్రెస్

- ఏడాదిన్నరలో యథేచ్ఛగా దోపిడీ
- కేసీఆర్‌వి ట్రిపుల్ ఆర్ స్కీమ్స్
- రేవంత్‌వి ట్రిపుల్ ఆర్ స్కామ్స్
- విచారణ పేరిట కేసీఆర్, కేటీఆర్‌కు వేధింపులు
- మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఫైర్



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి. చిత్రంలో నాయకులు వాసుదేవరెడ్డి, పల్లె రవికుమార్ తదితరులు

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు కరప్షన్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి విమర్శించారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ నుంచి జడ్ వరకు 26 కుంభకోణాలు చేశారని విమర్శించారు. శుక్రవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి గురువింద గింజ లాంటోడు.. తన కింద నలుపు గుర్తించకుండా దొంగే దొంగా..దొంగా అని అరిచినట్టు.. అక్రమాలకు తెరలేపి గగ్గోలు పెడుతున్నారని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలు ఎగ్గొట్టి రే'వోంట్'రెడ్డిగా మారాడని ఎద్దేవాచేశారు. ఏఐసీసీ అంటే ఆల్ ఇండియా కరప్షన్ సెంటర్.. పీసీసీ అంటే ప్రదేశ్ కరప్షన్ సెంటర్ అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు బిల్డర్‌ను బ్లాక్‌మెయిల్ చేసేందుకే కోర్టులో పిల్ దాఖలు చేశారని ఆరోపించారు. అవినీతికి చిరునామాగా మారిన ఆ పార్టీ జెండాను మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌వి ట్రిపుల్‌ఆర్ స్కీమ్స్ రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ అయితే, కాంగ్రెస్‌వి ట్రిపులార్ స్కాంలు రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి కుంభకోణాలని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాన అనుచరుడు ఫహీం హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న భూములపై కన్నేశాడని, సీఎం అండతో అరాచకాలు సృష్టిస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో బస్సుల కొనుగోళ్లు, డాక్యుమెంటరీల ఫోర్జరీ, కమీషన్లు, కలెక్షన్లు, ఫార్మా, ఫోర్త్‌సిటీ పేరిట భూదందాలు, హైడ్రా పేరుతో కలెక్షన్లు, జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం, కర్ణాటక మిల్క్ కో ఆపరేటీవ్ స్కాం, మైనింగ్ మాఫియా, క్వారీల స్కామ్స్.. ఏ టు జడ్ వరకు అనేక స్కాంలు జరిగాయని వివరించారు.

**తెలంగాణ జాతిపితపై నిందలా?**

చావునోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌పై రేవంత్ సర్కారు విచారణల పేరిట నిందలేయడం దుర్మార్గమని జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసులు వేస్తూ ఇబ్బందిపెడుతున్న కాంగ్రెస్‌కు ఆయన ఉసురు తగులుతుందని విమర్శించారు. ఫార్ములా-ఈ రేస్ తెచ్చి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచిన కేటీఆర్‌ను బద్నాం చేసేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు పల్లె రవికుమార్‌గౌడ్, వాసుదేవారెడ్డి పాల్గొన్నారు.

## యూరియా కోసం క్యూలో చెప్పులు




యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం పద్మాజీవాడి సింగిల్ విండోకు రైతులు శుక్రవారం పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. చెప్పులను వరుసలో పెట్టి గంటల తరబడి వేచి ఉన్నారు. స్టాక్ అందరికి అందకపోవడంతో రైతులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. - రామారెడ్డి (సదాశివనగర్)

# వ్యవసాయ విద్యలో గ్లోబల్ హబ్‌గా భారత్

- పాఠశాల స్థాయిలోనే అగ్రి కోర్సు తేవాలి
- భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి మాజీ డిప్యూటీ డైరెక్టర్

హైదరాబాద్, జూన్ 20 (నమస్తేతెలంగాణ): వ్యవసాయ విద్యలో భారత్ ప్రపంచ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతుందని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్సీ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. వీక్షిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్‌లో వ్యవసాయ విద్య భాగస్వామ్యం కావడం చాలా ముఖ్యమని పిలుపునిచ్చారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఉద్యాన కళాశాలలో శుక్రవారం జరిగిన 'వ్యవసాయ విద్య, అవకాశాలపై వర్క్‌షాప్'లో ఆయన మాట్లాడారు. ప్రపంచ దేశాలు భారతీయ వ్యవసాయ విద్య వైపు చూస్తున్నాయని, అందుకే ఆవిష్కరణల వైపు విద్యార్థులు మొగ్గు చూపాలని కోరారు. భారత్ 5 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థికశక్తిగా ఎదగడంలో వ్యవసాయ ఆధారిత స్టార్టప్ పరిశ్రమల పాత్ర చాలా కీలకమని తెలిపారు.

# ముఖ్యమంత్రి మెప్పు కోసమే ఆరాటం

- కేటీఆర్‌పై గజ్జెల కాంతం అనుచిత వ్యాఖ్యలు సహించం
- బీఆర్‌ఎస్ విద్యార్థి, యూత్ నేతల హెచ్చరిక



హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ మెప్పు పొంది పదవులు పొందాలనే ఆరాటంతో కాంగ్రెస్ నేత గజ్జెల కాంతం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని బీఆర్‌ఎస్ విద్యార్థి నాయకులు తుంగబాలు, బొమ్మెర రామ్మూర్తి, యూత్ నాయకులు వల్లమల్ల కృష్ణ, వీరబాబు ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిత్యం మద్యం మత్తులో ఉండే గజ్జెల కాంతం సోయిలేకుండా కేటీఆర్‌పై నోరుపారేసుకుంటున్నాడని మండిపడ్డారు. గతంలో బీఆర్‌ఎస్‌లో కొనసాగినప్పుడు ఆకాశానికెత్తిన నాయకులను నేడు రేవంత్ ప్రాపకం కోసం తూలనాడడం సరికాదన్నారు. దళిత సంఘాల ముసుగులో, ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్‌గా దందాలు, చందాలే లక్ష్యంగా పనిచేశారని ఆరోపించారు. గొప్ప నాయకులపై ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే గొప్పవాడినైపోతాననే భ్రమలో నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గాంధీభవన్‌ను బూతుల భవన్‌గా మార్చిన ఘనత ఆయనకే దక్కిందని ఎద్దేవా చేశారు.

# ఇన్నాళ్లూ అక్కడే ఎందుకు పనిచేశారు?

- తొలిరోజు విచారణలో శ్రీధర్‌పై ఏసీబీ ప్రశ్నల వర్షం

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్‌పై శుక్రవారం తొలిరోజు విచారణలో ఏసీబీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించినట్టు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం పనిచేసిన తర్వాత మళ్లీ అక్కడే పోస్టింగ్ తీసుకోవడం వెనుక ఉన్న కారణాలపై శ్రీధర్‌ను ప్రశ్నించడంతోపాటు ఇరిగేషన్‌శాఖలో ఆయన సాగించిన వసూళ్లపై ఆరా తీసినట్టు సమాచారం. శ్రీధర్‌పై ఈ నెల 11న కేసు నమోదు చేసిన ఏసీబీ.. అదే రోజు ఉదయం రాష్ట్రవ్యాప్తంగా 14 ప్రాంతాల్లో సోదాలు చేపట్టింది.

## ప్రభుత్వ అధికారిగా ఉంటూ ఫేక్ ప్రచారమా?

**శ్రీరాం కర్రిపై డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ ఫైర్**

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ అధికారిగా ఉండి తనపై ఫేక్ వార్తలను వ్యాప్తి చేస్తారా? అని రాష్ట్ర మీడియా అండ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ శ్రీరాం కర్రిపై తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ ఫైర్ అయ్యారు. ఓ మహిళా జర్నలిస్టు చేసిన ట్వీట్‌ను శ్రీరాం కర్రి రీపోస్ట్ చేయడంతో శుక్రవారం ఆయన 'ఎక్స్' వేదికగా ఘాటుగా స్పందించారు. మహిళా జర్నలిస్టు ట్వీట్‌లో ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించేందుకు తమతో పనిచేయాలని, ఇందుకు తాము ఫండింగ్ చేస్తామని కోరాననడం ఫేక్ ప్రచారమని దిలీప్ తెలిపా రు. శ్రీరాం కర్రిని ఉద్దేశిస్తూ.. 'మీరు ఇంత కింది స్థాయికి దిగజారుతారని అనుకోలేదు. ప్రస్తుతం మీరు తెలంగాణ ప్రభుత్వంలో అధికారిగా కొనసాగుతున్నారు. నకిలీ వార్తలను వ్యాప్తి చేయడం ఏ ప్రభుత్వ ఉద్యోగికి తగ దు. అసమర్థ కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా ప్రశ్నిస్తుంటే మీ బాస్(రేవంత్) తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. కాంగ్రెస్ ఐటీ సెల్‌కు పని చేయాలనుకుంటే వెంటనే మీ ఉద్యోగానికి రాజీనామా చేయాలి' అని దిలీప్ ట్వీట్ చేశారు.

## రైతులకు సంకెళ్లు వేయడం దురదృష్టకరం

- అలంపూర్ ఘటనపై పోలీసు అధికారుల నిర్లక్ష్యం
- ఐజీ సత్యనారాయణ

మహబూబ్‌నగర్, జూన్ 20 : ఇథనాల్ ఫ్యాక్టరీని అడ్డుకున్న ఘటనలో ఇటీవల అలంపూర్ కోర్టుకు రైతులను తీసుకెళ్లే సమయంలో సంకెళ్లు వేయడం దురదృష్టకరమని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మహబూబ్‌నగర్‌లో జోగుళాంబ జోన్ పరిధిలోని ఉమ్మడి జిల్లాల ఎస్పీలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల అలంపూర్ కోర్టులో, సంగారెడ్డిలో జరిగిన ఘటనలు చాలా దురదృష్టకరమైనవని, ఇటువంటివి జరగకుండా చూస్తామని తెలిపారు. బాధ్యులను సస్పెండ్ చేశామన్నారు.

## 45 రోజుల తర్వాత ఎన్నికల ఫుటేజీ తొలగించండి

**రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారులకు ఈసీ ఆదేశాలు**

న్యూఢిల్లీ, జూన్ 20: దుర్మార్గపు, హానికర కథనాలు సృష్టించడానికి తమ ఎలక్ట్రానిక్ డాటాను ఉపయోగిస్తున్నారని కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఆందోళన వ్యక్తం చేసింది. ఎన్నికల ప్రక్రియలకు సంబంధించిన సీసీటీవీ కెమెరా, వెబ్‌కాస్టింగ్, వీడియో ఫుటేజ్ సహ ఇతర డిజిటల్ డాక్యుమెంట్స్‌ను 45 రోజుల వరకు భద్రపర్చాలని రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులను ఈసీ తాజాగా ఆదేశించింది. ఎన్నికల ఫలితాన్ని సవాల్ చేస్తూ 45 రోజుల్లోగా హైకోర్టుల్లో పిటిషన్ దాఖలైతే తప్ప, సంబంధిత నియోజకవర్గం డాటాను 45 రోజుల తర్వాత ధ్వంసం చేయవచ్చునని రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులను ఈసీ ఆదేశించింది. ఈమేరకు మే 30న ఆయా రాష్ట్రాల సీఈసీలకు ఈసీ లేఖ రాసినట్టు తెలిసింది.

## మొత్తం ఎన్నికల ఖర్చులో 45% బీజేపీదే

**రెండో స్థానంలో కాంగ్రెస్**

న్యూఢిల్లీ, జూన్ 20: గత ఏడాది దేశ వ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీ ఎంత ఖర్చు చేసిందనే వివరాలను అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) అనే సంస్థ వెల్లడించింది. మొత్తం ఎన్నికల వ్యయంలో 1,494 కోట్ల రూపాయలు (44.56 శాతం)ను అధికార బీజేపీ ఖర్చు చేసిందని ఏడీఆర్ శుక్రవారం తెలిపింది. ఆ తర్వాత 620 కోట్లు (18.5 శాతం)తో కాంగ్రెస్ ఉందని తెలిపింది. లోక్‌సభ, దానితో పాటు ఏపీ, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, సిక్కింలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 32 జాతీయ, ప్రాంతీయ పార్టీలు కలిసి 3,352.81 కోట్ల రూపాయలను ఖర్చు చేశాయి. వీటిలో జాతీయ పార్టీల వాటా 2,204 కోట్లు (65.75 శాతం). అదే సమయంలో జాతీయ పార్టీలు రూ.6,930.246 కోట్లు, ప్రాంతీయ పార్టీలు 513.32 కోట్లు (6.92 శాతం) నిధులను సేకరించాయి. పార్టీ అభ్యర్థులు ఇచ్చిన ఎన్నికల వ్యయ వివరాల ఆధారంగా వీటిని వెల్లడించినట్టు ఏడీఆర్ తెలిపింది. అభ్యర్థులు ప్రచారం, ప్రయాణాలకు ఎక్కువ వ్యయం చేసినట్టు తమ లెక్కల్లో చూపారని పేర్కొంది.

# 1,600 కోట్ల పాస్‌వర్డ్‌లు లీక్

- ఇంటర్నెట్ చరిత్రలోనే అతిపెద్ద డాటా చౌర్యం ఇది
- ఈ-మెయిల్, సోషల్ మీడియా ఖాతాలు, ప్రభుత్వ పోర్టళ్ల లాగిన్ వివరాలు బహిర్గతం
- వెంటనే పాస్‌వర్డ్‌లు మార్చుకోండి
- సైబర్ నిపుణుల సూచన



న్యూఢిల్లీ, జూన్ 20: ఆన్‌లైన్‌లో అతిపెద్ద డాటా చౌర్యం జరిగింది. దీని వల్ల ఏకంగా 1,600 కోట్లకుపైగా పాస్‌వర్డ్‌లు బహిర్గతమయ్యాయి. ఇది ఇంటర్నెట్ చరిత్రలోనే అతిపెద్ద సెక్యూరిటీ లీక్‌గా నిలిచింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మంది వినియోగదారుల వ్యక్తిగత సమాచారానికి ముప్పు ఏర్పడిందని, ఇది విస్తృతమైన ఫిషింగ్ స్కామ్‌లు, గుర్తింపు చోరీ (ఐడెంటిటీ థెఫ్ట్), ఆన్‌లైన్ ఖాతాల హ్యాకింగ్‌కు దారితీయవచ్చని సైబర్‌న్యూస్, ఫోర్బ్స్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇది చాలా కాలం నుంచి ఉన్న పాత డాటా డంప్ కాదని, లీక్ అయిన సమాచార వివరాల్లో కొత్తవి, చక్కగా ఆర్గనైజ్ చేసినవి, 'ఇన్ఫోస్టీలర్లు' అని పిలిచే ఒక రకమైన మాల్‌వేర్ ద్వారా సేకరించినవి ఉన్నాయని సెక్యూరిటీ పరిశోధకులు చెప్తున్నారు. ఈ మాల్‌వేర్ ప్రోగ్రామ్‌లు ప్రజల డివైజ్‌ల నుంచి నిశబ్దంగా యూజర్‌నేమ్‌లు, పాస్‌వర్డ్‌లను తస్కరించి హ్యాకర్లకు పంపుతాయి. ఆ వివరాలను హ్యాకర్లు నేరుగా ఉపయోగిస్తారు. లేదంటే డార్క్ వెబ్ వేదికల్లో అమ్మకానికి పెడతారు.

**లీకైన డాటాలో ఏమున్నది?**

లీక్ అయిన డాటాలో ఈ-మెయిల్ ఖాతాలు, గూగుల్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్ లాంటి సోషల్ మీడియా వేదికలతోపాటు కొన్ని ప్రభుత్వ పోర్టళ్ల సేవల కోసం వినియోగదారులు ఉపయోగించే లాగిన్ వివరాలు ఉన్నట్టు తెలుస్తున్నది. సైబర్ నేరగాళ్లు సులభంగా ఉపయోగించుకోగలిగేలా ఇందులో చాలా సమాచారం వెబ్‌సైట్ లింక్‌తోపాటు యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌ను చూపించే ఫార్మాట్‌లో ఉన్నట్టు స్పష్టమవుతున్నది. ఎంతో నిర్మాణాత్మకంగా, వినియోగాత్మకంగా ఉన్న ఈ డాటాను చూసి సైబర్ సెక్యూరిటీ నిపుణులే నివ్వెరపోతున్నారు. ఇది కేవలం డాటా ఉల్లంఘన మాత్రమే కాదని, 'ప్రపంచ సైబర్ నేరానికి బ్లూప్రిట్' అని పేర్కొంటున్నారు. రక్షణ లేని ఓ వెబ్ సర్వర్‌లో 18.4 కోట్ల రికార్డులతో కూడిన ఓ రహస్య డాటా బేస్ ఉన్నట్టు ఇటీవల పలు నివేదికలు వెలువడిన నేపథ్యంలో ఈ భారీ లీకేజీ బయటపడింది. ఇందులో దాదాపు 30 భారీ డాటా సెట్లు ఉన్నాయని, ఒక్కో సెట్‌లో కోట్ల లాగిన్ వివరాలను సేకరించారని, మొత్తంగా 1,600 కోట్లకుపైగా పాస్‌వర్డ్‌లు చోరీకి గురయ్యాయని నిపుణులు భావిస్తున్నారు.

**ఎందుకు తీవ్రమైనది?**

తస్కరణకు గురైన డాటా ఎవరైనా సులభంగా కొనుగోలు చేయగలిగేలా అందుబాటులో ఉండటం ముప్పు తీవ్రతను మరింత పెంచుతున్నది. సాంకేతిక విజ్ఞానం అంతగా లేనివారితోపాటు చాలా తక్కువ డబ్బు ఉన్నవారు సైతం డార్క్ వెబ్‌లో ఈ పాస్‌వర్డ్‌లను యాక్సెస్ చేయగలరని, దీంతో రోజువారీ వినియోగదారులు మొదలుకొని కంపెనీల వరకు దాదాపు ప్రతి ఒక్కరికీ తీవ్రముప్పు పొంచి ఉన్నదని కొన్ని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు సంప్రదాయ పాస్‌వర్డ్‌ల నుంచి పాస్‌కీస్ లాంటి మరింత సురక్షితమైన ఆప్షన్లకు మారాలని గూగుల్ సూచించింది.

**ఇప్పుడు ఏం చేయాలి?**

డాటా లీకేజీ వల్ల ఏర్పడిన ముప్పు నుంచి బయటపడేందుకు ప్రతి ఒక్కరూ వెంటనే చర్యలకు ఉపక్రమించాలని సైబర్ సెక్యూరిటీ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అన్ని ప్రధాన ఆన్‌లైన్ ఖాతాల పాస్‌వర్డ్‌లను మార్చుకోవాలని, బలమైన, ప్రత్యేకమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలని, అన్ని వివరాలను భద్రంగా ఉంచుకునేందుకు టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్‌కి మారడంతోపాటు పాస్‌వర్డ్ మేనేజర్ యాప్స్‌ను వినియోగించాలని సూచిస్తున్నారు. ఇప్పటికే ఏదైనా సమాచారం లీక్ అయిందేమో తనిఖీ చేసుకునేందుకు డార్క్ వెబ్ మానిటరింగ్ టూల్స్‌ను ఉపయోగించాలని, తస్కరణకు గురైన డాటాలో ఎవరివైనా ఈమెయిళ్లు లేదా పాస్‌వర్డ్‌లు ఉంటే ఈ టూల్స్ వెంటనే అప్రమత్తం చేస్తాయని తెలిపారు.



## అంధ బాలల పాట.. రాష్ట్రపతి కంటతడి

డెహ్రాడూన్, జూన్ 20: తన 67వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అభినందనలు తెలుపుతూ కొందరు అంధ బాలల బృందం ఆలపించిన పాటను విని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్వేగానికి లోనై కన్నీరు పెట్టుకున్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆమె శుక్రవారం ఉత్తరాఖండ్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ విజువల్ డిజేబిలిటీస్ (ఎన్‌ఐఈపీవీడీ)ని సందర్శించారు.

## 20% తగ్గిన ఎయిరిండియా బుకింగ్స్

**అహ్మదాబాద్ విమాన ప్రమాదం తర్వాత ప్రయాణికుల నిరాసక్తి**

న్యూఢిల్లీ, జూన్ 20: అహ్మదాబాద్‌లో డ్రీమ్‌లైనర్ విమాన ప్రమాదం తర్వాత ఎయిరిండియా బుకింగ్స్ సగటున 20 శాతం, టికెట్ ధరలు 15 శాతం తగ్గాయని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్(ఐఏటీవో) వెల్లడించింది. దేశీయ, అంతర్జాతీయ విమానాలు రెండింట్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నదని తెలిపింది. ఒక్కో ఎయిర్‌లైన్స్, ఒక్కో రూట్‌లో ఈ తగ్గుదలలో మార్పులు ఉన్నాయని పేర్కొంది. ఎయిరిండియా విమానాల్లో భద్రతపరంగా వ్యవస్థాగత లోపాలు లేవని, అంతర్జాతీయ భద్రతా ప్రమాణాలు పాటిస్తూ డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) తగిన చర్యలు తీసుకుంటుందని వెల్లడించింది. ఈ ప్రతికూల పరిస్థితి తాత్కాలికమని, ప్రయాణికుల్లో తిరిగి విశ్వాసం నెలకొంటుందని ఐఏటీవో అధ్యక్షుడు రవి గోసైన్ చెప్పారు. ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఇన్ ఇండియన్ టూరిజం, హాస్పిటాలిటీ(ఎఫ్ఏఐటీహెచ్) జనరల్ సెక్రటరీ రాజీవ్ మెహ్రా కూడా ఇదే అభిప్రాయం వ్యక్తంచేశారు. కానీ టికెట్ బుకింగ్స్, ధరల తగ్గుదలపై ఎయిరిండియా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

**8 ఎయిరిండియా విమానాలు రద్దు!**

నిర్వహణ కారణాల వల్ల శుక్రవారం 8 విమాన సర్వీసులను రద్దు చేసినట్టు ఎయిరిండియా తెలిపింది. ఇందులో 4 అంతర్జాతీయ, 4 దేశీయ సర్వీసులు ఉన్నాయని వెల్లడించింది. అంతర్జాతీయ సర్వీసులలో దుబాయ్-చెన్నై, ఢిల్లీ-మెల్‌బోర్న్, మెల్‌బోర్న్-ఢిల్లీ, దుబాయ్-హైదరాబాద్ విమానాలు, దేశీయ సర్వీసులలో పుణె-ఢిల్లీ, అహ్మదాబాద్-ఢిల్లీ, హైదరాబాద్-ముంబై, చెన్నై-ముంబై విమానాలు ఉన్నాయి.

## ఎయిరిండియా విమానాన్ని ఢీకొట్టిన పక్షి

**పుణె నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన విమానం రద్దు**

న్యూఢిల్లీ: ఢిల్లీ-పుణె ఎయిరిండియా విమానాన్ని పక్షి ఢీకొట్టింది. విమానం ఢిల్లీ నుంచి పుణెకు సురక్షితంగా చేరుకున్న తర్వాత పక్షి ఢీకొట్టిన విషయం గుర్తించినట్టు ఎయిరిండియా ఓ ప్రకటనలో పేర్కొంది. పుణె నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన రిటర్న్ జర్నీని రద్దు చేసినట్టు తెలిపింది. 'ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. టికెట్ల క్యాన్సిల్ చేసుకున్న వారికి డబ్బులు తిరిగి ఇచ్చాం' అని తెలిపింది.

**ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య**

చెన్నై నుంచి మదురైకి 68 మంది ప్రయాణికులతో బయల్దేరిన ఇండిగో విమానం అరగంట ప్రయాణం చేసిన తర్వాత సాంకేతిక సమస్య తలెత్తడంతో తిరిగి చెన్నైకి వచ్చి ల్యాండ్ అయింది. మార్గమధ్యలో సమస్యను గుర్తించిన పైలట్ వెనక్కి వచ్చేందుకు అనుమతి కోరగా అధికారులు అనుమతించారని ఇండిగో అధికారులు తెలిపారు.



ములుగు జిల్లా వెంకటాపురం(నూగూరు) మండల కేంద్రంలో మూసిన దుకాణాలు


# నిర్మానుష్యంగా ఏజెన్సీ

**మావోయిస్టుల బంద్ ప్రశాంతం**

ములుగు, జూన్ 20 (నమస్తే తెలంగాణ): ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మావోయిస్టు పార్టీ ఇచ్చిన తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల బంద్ పిలుపు నేపథ్యంలో ములుగులోని ఏజెన్సీ ప్రాంతం నిర్మానుష్యంగా మారింది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం(నూగూరు), కన్నాయిగూడెం, ఏటూరునాగారం మండల కేంద్రాలతో పాటు ఏజెన్సీ గ్రామాల్లో బంద్ ప్రశాంతంగా కొనసాగింది. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను తుదముట్టిస్తున్న సందర్భంగా ఇచ్చిన బంద్ పిలుపుతో వ్యాపారస్తులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వచ్ఛందంగా దుకాణాలను మూసేసి బంద్‌లో పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్న సమయంలో వ్యాపారస్తులు తమ దుకాణాలను తెరిచి వ్యాపారాలు నిర్వహించారు. ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మావోయిస్టుల బంద్ పిలుపు నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు మారుమూల ప్రాంతాలకు బస్సు సర్వీసులను రద్దు చేశారు. ప్రైవేటు వాహనాల ద్వారా రాకపోకలు కొనసాగించారు.


**ఎదురుకాల్పుల్లో మహిళా మావోయిస్టు మృతి**

భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మహిళా మావోయిస్టు మృతిచెందిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. కాంకేర్ జిల్లా చోటే బేతియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నట్లు పోలీస్ అధికారులకు సమాచారం అందింది. దీంతో జిల్లా రిజర్వ్ గార్డ్స్(డీఆర్‌జీ), బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) భద్రతా దళాలు సంయుక్తంగా సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ సందర్భంగా చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌లో మహిళా మావోయిస్టు మృతిచెందింది.



## శుభాన్షు రోదసి యాత్ర మళ్లీ వాయిదా

కాలిఫోర్నియా: భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా రోదసి యాత్రకు అవాంతరాలు ఎదురవుతూనే ఉన్నాయి. ఆదివారం చేపట్టాల్సిన యాక్సియం-4 మిషన్‌ను నాసా మళ్లీ వాయిదా వేసింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో రష్యాకు చెందిన సెక్షన్‌లో ఇటీవల మరమ్మతులు జరిగాయి. దీన్ని పరిశీలించడానికి మరింత సమయం పడుతున్నందున 22న చేపట్టాల్సిన మిషన్‌ను వాయిదా వేస్తున్నట్టు నాసా తెలిపింది. ఈ ప్రయోగం ఇప్పటివరకు ఆరుసార్లు వాయిదా పడింది.



## కెనడాలో భారత విద్యార్థిని అనుమానాస్పద మృతి

న్యూఢిల్లీ, జూన్ 20: కెనడాలో మరో భారతీయ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మరణించింది. కల్గరీ యూనివర్సిటీలో చదువుతున్న భారత్‌కు చెందిన తాన్యా త్యాగి అనే విద్యార్థిని మరణించింది. అయితే ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదు. వాంకోవర్‌లోని భారత కాన్సులేట్ కార్యాలయం ఈ విషయాన్ని గురువారం వెల్లడించింది. గత మూడు నెలల కాలంలో భారత్‌కు చెందిన విద్యార్థులు అనుమానాస్పదంగా మరణించడం ఇది నాలుగోసారి. దీంతో విద్యార్థుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.